క్లుప్తంగా

నూతన పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు పరిశీలన



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: గ్రామంలో నూతన పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. వీఆర్వోలు సాకా సత్యనారాయణ, వెన్నేటి రామకృష్ణలతో కలిసి కోరాటివారి వీధి ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై మండలంలో 198వ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని, అందులో భాగంగా కపిలేశ్వరపురంలోని కోరాటివారి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించామని తహసీల్దార్ తెలిపారు.

పాఠశాలలో రికార్డుల తనిఖీలు



పాఠశాలలో ఆహార నాణ్యతను పరీక్షిస్తున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: గ్రామంలోని కోరాటివారి వీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణ తీరును తహసీల్దార్ జి.శ్రీనివాస్ పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల హాజరు, భోజనం వడ్డించిన తీరు, రికార్డులను తహసీల్దార్ తనిఖీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, భోజన పథకం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వై.శ్రీనివాసరావు ఉన్నారు.

ఆర్థిక సాయం

బిక్కవోలు: మండలంలోని ఆర్ఎస్‌పేటలో కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన లక్ష్మీవరపు మాణిక్యం మనవరాలు శిరీష వివాహం కోసం ఈ సాయం చేశారు.


కార్గిల్ విజయోత్సవ ర్యాలీ



హసన్‌బాదలో కాగడాలతో కార్గిల్ విజయోత్సవ ర్యాలీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో శనివారం కాగడాలతో కార్గిల్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ సూచనల మేరకు 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం విజయవంతంగా ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకుని విజయోత్సవ ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పెద్దలు, చిన్నారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

రాయవరం: మండలంలోని చెల్లూరు పంచాయతీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు నాయకులు శ్రీకారం చుట్టారు. గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయం–3 భవనం, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.90లక్షలతో నిర్మించనున్న రహదారులు, డ్రైన్లకు, రూ.1.31 కోట్లతో నిర్మించనున్న నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం ప్రారంభించారు. రూ.86.40లక్షలతో మంచి నీటి కుళాయి పథకం ప్రారంభం, అలాగే రూ.69లక్షలతో నిర్మించనున్న డ్వాక్రా మహిళ శక్తి భవనానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం చెల్లూరు రైతు భవనంలో సమావేశం నిర్వహించారు.

సామాజిక సమస్యలపై నేడు సదస్సు

కపిలేశ్వరపురం (మండపేట): యువజన, విద్యార్థులు కేంద్రంగా సామాజిక సమస్యలపై చర్చించే లక్ష్యంతో ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్టు మండపేటకు చెందిన సంగమం సాంస్కృతిక వేదిక నిర్వాహకులు చల్లా రవికుమార్, మెహర్ ప్రసన్న శనివారం తెలిపారు. హోమియో వైద్యుడు డాక్టర్ చల్లా వెంకట్రావు 17వ వర్ధంతి నేపథ్యంలో 'యువతరమా..ఎటు నీ పయనం, ఏది నీ గమ్యం' అనే అంశంపై విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండపేటలోని అన్నపూర్ణ హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. విద్య, కెరీర్ ఎంపిక, వ్యక్తిత్వ వికాసంతో కూడిన జీవనం, సామాజిక జీవితంలో వ్యక్తి పాత్ర, వ్యసనాలు, మాదక ద్రవ్యాల ప్రభావం తదితర అంశాలపై విద్యార్థి, యువజనులతో కూడిన బృందాలతో చర్చించనున్నామని వారు పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమం..

సాహితీ సేద్యం..



గ్రూపు గుర్తింపు కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకం ఎంబ్లం

- విజ్ఞాన వికాసమే లక్ష్యంగా సాహిత్య కృషి
- పుస్తక పఠనం కోసం సోషల్ మీడియా గ్రూపులు
- విలువైన పుస్తకాలు సైతం లభ్యం
- సాహిత్యాభిమానుల వినూత్న కృషి

కపిలేశ్వరపురం: మానవ సమాజం భవిష్యత్ అంతా గత కాలంలో జరిగిన మనిషి తాలూక కృషిపై ఆధారపడి ఉంటుంది. ఆనాటి సాహిత్యం, సంస్కృతి, సాంప్రదాయాలు గత కాలం కృషికి ప్రామాణికం. వాటికి అక్షర రూపం ఇచ్చిన గ్రంథాలు మానవ సమాజ నిర్మాణానికి గమ్యాన్ని చూపే చోదకశక్తి. మారిన కాలంలో పుస్తకం డిజిటల్ రూపాన్ని సంతరించుకుంది. ఆ సదుపాయం కాస్త.. పుస్తక పఠనా సదుపాయాన్ని ఎన్నో రెట్లు పెంచింది. ఒకప్పుడు పుస్తకాలు కావాలంటే గ్రంథాలయం, పుస్తక ప్రచురణ సంస్థల విక్రయ శాలల్లోనే లభ్యమయ్యేవి. ప్రస్తుతం వాట్సాప్, టెలిగ్రామ్ లాంటి సామాజిక మాధ్యమాల్లో గ్రూప్‌కట్టి సాహిత్య సంపదను పది మందికి పంచిపెడుతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాలు సాహిత్య కృషికి పెట్టింది పేరు.

రెండు నియోజకవర్గాల్లో సామాజిక కృషి ఇలా...

రామచంద్రపురానికి చెందిన డాక్టర్ చెలికాని రామారావు భారత పార్లమెంట్‌లో తొలి పార్లమెంటేరియన్‌గా సేవలందించారు. డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ పేరుతో ఆయన కుమారుడు చెలికాని స్టాలిన్ సమకాలిన అంశాలపై రచయితలు, సాహితీవేత్తలు, ప్రగతిశీల శక్తులను ప్రోత్సహిస్తూ అనేక పుస్తకాలను ప్రచురించి పాఠక లోకానికి అందజేస్తున్నారు. రామచంద్రపురం, కాజులూరు, మండపేట, అంగర తదితర ప్రాంతాల్లో అనేక మంది సాహిత్య కృషి చేస్తున్నారు.

సామాజిక గ్రూపులతో సాహిత్య కృషి:

కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన పెద్దింశెట్టి రామకృష్ణారావు పుస్తకం పేరుతో ఓ వాట్సాప్ గ్రూపును రూపొందించి సాహిత్య కృషి చేస్తున్నారు. రామచంద్రపురంలో డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ, మండపేట కేంద్రంగా సంగమం పేరుతో ప్రముఖ హోమియో డాక్టర్ చల్లా రవికుమార్, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి పుస్తక పఠణానికి ఊపిరి ఊదుతున్నారు. గ్రూపు సభ్యులు తమ వద్ద ఉన్న పీడీఎఫ్ ఫార్మాట్‌లోని వివిధ రకాల పుస్తకాలను గ్రూప్‌లో పోస్ట్ చేసుకుంటున్నారు. చదివిన అనంతరం వాటిపై చర్చించుకుంటూ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. పుస్తకం గ్రూపు తరచూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సాహితి సభలను సైతం నిర్వహిస్తోంది.

గ్రూప్ సభ్యులు పోస్ట్ చేసుకుంటున్న పుస్తకాలివే..

నీతి కథలు, చిన్నపిల్లల కథలు, చందమామ కథలు, ప్రపంచ చరిత్ర, పలు రంగాలకు చెందిన వారి జీవిత చరిత్రలు, అభ్యుదయ, దళిత, కమ్యూనిజం, మతం, తత్వశాస్త్రం, సైన్స్, ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యం, సాంస్కృతిక అంశాలకు చెందిన రచనలను సభ్యులు పోస్ట్ చేసుకుంటున్నారు. ప్రస్తుత కాలంలో మార్కెట్‌లో అందుబాటులో లేని పాతకాలపు పుస్తకాలు సైతం గ్రూపు ద్వారా సభ్యులకు అందుతుండటం విశేషం.

మానవ ప్రగతికి చోదక శక్తి అధ్యయనం



ఆధునీకకాలం అంతా అయోమయమనో, తప్పుదారిపడుతున్న కాలమనో సాధారణంగా ప్రజలు చెప్పుకుంటుంటారు. వాస్తవానికి భూమి గుండ్రంగా నిత్యం పరిభ్రమిస్తున్నట్టే.. మానవ సమాజం సైతం మారుతూ ఉంటుంది. సమాజ మార్పు అనేది నిర్దేశించిన చలన సూత్రాలు ఆధారంగా జరుగుతుందని మార్క్స్ మహనీయుడు చెప్పారు. మార్పును అంగీకరించే తత్వాన్ని ప్రజల్లో అలవాటు చేయడంతోపాటు, సమాజ నడవడికను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని ప్రజల్లో పెంచాల్సిన అవసరం ఉంది. అందుకు సాహిత్య సేవ దోహదపడుతుంది. సంగమం సాహిత్య వేదిక ఆ దిశగా కృషి చేస్తుంది.

– డాక్టర్ చల్లా రవికుమార్, సంగమం సాంస్కృతిక వేదిక, మండపేట.

దేశ రక్షణే అందరి ధ్యేయం

కపిలేశ్వరపురం (మండపేట): దేశ రక్షణే ధ్యేయంగా సైనికులు పోరాడుతున్న తీరుగానే సమాజాన్ని రక్షించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సదస్సును నిర్వహించారు. 1999 కార్గిల్ వార్ సందర్భాన్ని, సన్నివేశాలను వివరించే దిశగా రూపొందించిన డాక్యుమెంటరీని డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించారు. లెఫ్టినెంట్ కమాండర్ డా.కేఎస్సార్ మాట్లాడుతూ, భారత ఆర్మీ, నౌకాదళం, వాయుసేన విభాగాల సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, అధ్యాపకులు శంకర్, కిరణ్, వెంకన్న, గోపాలకృష్ణ, రామకృష్ణ, సుందర్, శ్రీకాంత్, బాబూరావు, రాజేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వేణు పరామర్శ



ఏడుకొండలను పరామర్శిస్తున్న వేణు

రామచంద్రపురం రూరల్: ఇటీవల కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న నియోజకవర్గ శెట్టిబలిజ సంఘం నేత నరాల ఏడుకొండల్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసు వేణుగోపాలకృష్ణ శనివారం ద్రాక్షారామలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గురుకుల పాఠశాలలో ఖాళీల భర్తీ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో వివిధ తరగతుల్లో ఖాళీలను ఆసక్తి కలిగిన విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ చింతా శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వాటి వివరాలిలా ఉన్నాయి. 5వ తరగతిలో 37, 6వ తరగతిలో 12, 8వ తరగతిలో 5, 9వ తరగతిలో 3, 10వ తరగతిలో 16, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో 45, రెండో సంవత్సరంలో 58 ఖాళీలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షతో సంబంధం లేకుండా అర్హులైన విద్యార్థులను నేరుగా చేర్చుకుంటామన్నారు. పదో తరగతి సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన వారు కూడా చేరవచ్చని తెలిపారు. వివరాలకు ఆధార్ కార్డుతో నేరుగా సంప్రదించాలని కోరారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్లు 9550551900, 9441563110 సంప్రదించాలని సూచించారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



కాపవరంలో సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరం సచివాలయం నుంచి బదిలీపై వెళుతున్న ఉద్యోగులను ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు శనివారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ రెడ్నం సతీష్ ఆధ్వర్యంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ మాచవరపు నవ్యసుధ, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పాలిక శ్రీరామలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాండ్రంగి అర్జున్ చైతన్య సచివాలయ పరిధిలోని కాపవరం, తాటిపల్లి గ్రామాల ప్రజలకు వారు చేసిన సేవలను వక్తలు అభినందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ అంబటి భవాని మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చారన్నారు. అటువంటి గొప్ప వ్యవస్థలో ఉన్న సచివాలయ ఉద్యోగులు మరింతగా రాణించాలని అభిలాషించారు. కాపవరం ఎంపీటీసీ రెడ్నం సతీష్ మాట్లాడుతూ, 2014లో ఎంపీఈఓగా పనిచేసిన అగ్రికల్చర్ అసిస్టెంట్ నవ్యసుధ సచివాలయ ఉద్యోగం కోసం పరీక్ష రాసి కౌన్సెలింగ్‌లో కాపవరం గ్రామాన్నే కోరుకుందన్నారు.

అదేవిధంగా అప్పటి పాఠశాలలో విద్యా వాలంటీర్‌గా సేవలందించిన శ్రీరామలక్ష్మి సచివాలయ ఉద్యోగం వచ్చినప్పుడు తిరిగి కాపవరం గ్రామాన్నే కోరుకుని ఇక్కడే పనిచేయడం తమ గ్రామంలో ఉద్యోగులకు ఇచ్చే ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పిల్లి బాలసుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్, పంచాయతీ కార్యదర్శి రఘు, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ముమ్మిడి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి



ప్రమాణ స్వీకారం చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులు

కె.గంగవరం: రైతులకు అందుబాటులో ఉండి సొసైటీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటానని అముజూరు సొసైటీ అధ్యక్షుడు పెంకే గోవిందరాజు అన్నారు. మండల పరిధిలోని కూళ్ల, అముజూరు సొసైటీ అధ్యక్షుడిగా గోవిందరాజు, సభ్యులుగా నేమాని సత్యనారాయణ, ఏడిద గంగాధరరావు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోనే పెద్ద సొసైటీగా ఉన్న అముజూరు సొసైటీ మరింత అభివృద్ధి చెందేలా రైతుల సహకారంతో అన్ని విధాల కృషి చేస్తామన్నారు. అనంతరం రెండు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజాప్రతినిధులు నూతన త్రిసభ్య కమిటీ సభ్యులను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, నాయకులు చిన్నికృష్ణ, మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్, సలాది రమేష్, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వినియోగంతో పెట్టుబడి ఆదా

కొత్తపేట: వ్యవసాయ, ఉద్యాన పంట సాగులో రసాయన ఎరువుల వాడకం క్రమేపీ తగ్గించి, జీవన ఎరువులు (బయో ఫెర్టిలైజర్స్) వినియోగం పెంచడం ద్వారా పెట్టుబడి గణనీయంగా తగ్గించుకోవాలని వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు రైతులకు సూచించారు. రసాయన ఎరువులు తగ్గించి జీవన ఎరువుల వినియోగం పెంచాలని కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రాల ద్వారా సరఫరా అవుతున్న ఎరువులను వ్యవసాయ శాఖ రైతుల్లోకి తీసుకువెళుతుంది. దానిలో భాగంగా సామర్లకోట బయో ఫెర్టిలైజర్స్ ఉత్పత్తి కేంద్ర ద్వారా సరఫరా అయిన ఫాస్ఫో బాక్టీరియా (పీఎస్‌బీ), పొటాషియం మొబిలైజింగ్ బాక్టీరియా (కేఎంబీ)లను ఏడీఏ శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ప్రదర్శించారు. వాటిని రైతుల్లోకి తీసుకువెళ్లే అంశంపై ఏడీఏ సబ్ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు (ఏఓ)తో సమీక్షించారు. రూ.150 విలువైన 500 మిల్లీలీటర్లు ఫాస్ఫో బాక్టీరియా రూ.520 విలువైన 50 కేజీల సూపర్ బస్తాతో సమానమని, అలాగే రూ.150 విలువైన 500 మిల్లీలీటర్ల పొటాషియం మొబిలైజింగ్ బాక్టీరియా రూ.1,800 విలువైన 50 కేజీల పొటాష్‌తో సమానమని వివరించారు. ఈ జీవన ఎరువులు అన్ని పంటలకు వినియోగించవచ్చని తెలిపారు. ఈ ఎరువులు వాడకాన్ని పెంచుకుంటూ వెళ్లడం వలన పంటల సాగుకు పెట్టుబడి తగ్గి క్రమేపీ పంటల దిగుబడులు పెరుగుతాయన్నారు. సమావేశంలో జె.భార్గవమహేష్, ద్వారాకాదేవి, లక్ష్మీలావణ్య, ఏఈఓ కోలా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

మామిడికుదురు: విద్యార్థులు ఇష్టపడి చదువుకుని తాము అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు సూచించారు. పాశర్లపూడిలంక జెడ్పీహెచ్ స్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన హస్త కళలపై అవగాహన సదస్సు శనివారం ముగిసింది. విద్యార్థులకు ఏర్పాటు చేసిన రాత పరీక్ష, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. హెచ్ఎం ఎన్.శ్రీదేవి అధ్యక్షతన సమావేశం జరిగింది. రాత పరీక్షలో గంటి ప్రణవి, ఎ.సాయితేజశ్విని, సీహెచ్ సాయి దీపిక, డ్రాయింగ్ పోటీల్లో సీహెచ్ నందిని, జి.రేణుక, టి.రాజేశ్వరి బహుమతులు సాధించారు.

హామీలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీయండి



రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న సూర్యప్రకాశ్



కూటమి మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరిస్తున్న సూర్యప్రకాశ్

వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని 26, 27 వార్డుల్లో శనివారం 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ.. వాటిని వెంటనే అమలు చేయాలని ప్రజలు నిలదీయాలన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు నాయుడు చేసిన వాగ్దానాలను వివరిస్తూ ఏ విధంగా మోసం చేస్తున్నారనే విషయాన్ని ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హామీలు అమలు చేయకుండా ప్రజలను తప్పుదారి పట్టించే కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. అమలు సాధ్యం కాని హామీలను గుప్పించి అధికారం చేపట్టిన తరువాత కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. హామీలు అమలు చేయలేక వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌తో కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. వీటిని ప్రజలకు తెలియజేసేందుకే పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ప్రతీ ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరిస్తున్నామన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, సత్తి సాయిలక్ష్మి, కౌన్సెలర్ బొక్క సత్యనారాయణ, కో–ఆప్షన్ సభ్యుడు గుబ్బల గణ తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాలిచ్చి మోసం చేస్తున్న చంద్రబాబు

రామచంద్రపురం రూరల్: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు ప్రజలకు అర్థమవుతున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని జగన్నాయకులపాలెం, వెలంపాలెం గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలసి ఆయన శనివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా చంద్రబాబు ప్రభుత్వం ఏ విధంగా మోసం చేస్తుందనేది ప్రజలు గమనిస్తున్నారన్నారు. హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కితే.. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చి ఏ ఒక్క పథకం పూర్తిగా అమలు చేయకుండా బహిరంగంగా అన్నీ అమలు చేశామంటూ నిస్సిగ్గుగా చెప్పుకుని తిరుగుతున్న ఘనత కూటమి నేతలకే దక్కిందన్నారు. అడ్డగోలుగా అబద్ధాలు చెప్పడం కూటమి నేతలకే చెల్లిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోను రీకాల్ చేయాలంటూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ ఫ్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, సర్పంచ్‌లు అనిశెట్టి రామకృష్ణ, పెమ్మిరెడ్డి దొరబాబు, ఎంపీటీసీలు పంపన ఏడుకొండలు, తుమ్మూరి సుబ్బలక్ష్మి, రెడ్నం సతీష్, పార్టీ నాయకులు అనిశెట్టి చంటి, దొమ్మేటి రాము, సాదే రాజేష్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను తెలపండి

రామచంద్రపురం: నియోజకవర్గంలోని ప్రతీ పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓల వద్ద తుది ఓటర్ల జాబితాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సరిచూసుకొని అభ్యంతరాలుంటే వెంటనే తెలియజేయాలని రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎన్నికలకు సంబంధించిన అంశాలు వారికి వివరించారు. నియోజకవర్గంలో మండలాల వారీగా ఆన్‌లైన్‌లో వచ్చిన 2025 జనవరి 6 నుంచి 2025 జూలై 25 వరకు వచ్చిన ఫారం–6 దరఖాస్తులు 310, ఫారం–7 దరఖాస్తులు 416, ఫారం–8 దరఖాస్తులు 583, మొత్తం 1309 క్లైమ్స్ వివరాలు, పెండింగ్ వివరాలపై ప్రజాప్రతినిధులకు వివరణ ఇచ్చి కాపీలను అందజేశారు. క్లైమ్స్ ఫారం 6,7,8 వివరాలు తెలుసుకొని వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే చెప్పాలని ఆర్డీవో కోరారు. నియోజకవర్గంలో తుది ఫొటో ఓటర్ల జాబితాలను చూసుకొని ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణల కోలం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తగా బూత్ లెవెల్ అధికారుల నియామకం జరిగిందని, ఎస్ఎస్ఆర్–2025 ప్రకారం మొత్తం ఓటర్లు 2,03,193 మంది ఉన్నారన్నారు. మూడు మండలాలకు చెందిన డిప్యూటీ తహసీల్దార్‌లు, వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం



పి.గన్నవరంలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న విప్పర్తి, పాముల

పి.గన్నవరం: మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో కలాం విగ్రహానికి శనివారం విప్పర్తి, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విప్పర్తి మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆందోళన



కుయ్యేరు, గొల్లపాలెం రోడ్డుపై అఖిలపక్షం నాయకుల ధర్నా

కాజులూరు: మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన కుయ్యేరు, గొల్లపాలెం రహదారి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం అఖిలపక్షం నాయకులు ఆందోళన చేపట్టారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక కృష్ణుడి ఆలయం వద్ద కుయ్యేరు, గొల్లపాలెం రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ, రూ.36 కోట్ల వ్యయంతో 13 కిలోమీటర్లు పొడవున రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయంలో పనులు ప్రారంభించారన్నారు. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం పనులు ముందుకు సాగట్లేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మధ్యలో గోతులు ఏర్పడ్డాయన్నారు. వర్షాల సమయంలో గోతుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యల్లో భాగంగా గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు బండారు భూరయ్య మాట్లాడుతూ, తమ నాయకులు అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో అసంపూర్తి రోడ్డు పూర్తి చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, పాలన ప్రారంభించి ఏడాది దాటినా అడుగుకూడా ముందుకు సాగలేదన్నారు. పరిస్థితి ఇలానే ఉంటే భవిష్యత్తులో టీడీపీకి కూడా 11 సీట్లే వస్తాయన్నారు. అనంతరం మండల అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల సమన్వయ కమిటీ చైర్మన్ దంగేటి అరుణ్‌కుమార్, యాళ్ల నరసింహమూర్తి, అమలాపురం బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు, శీల మాజీ ఎంపీటీసీ మాధవరపు నానాజీ, మండల గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

పెరుగుతున్న వరద

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని నదీపాయల్లో వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద ఉధృతి పెరగడంతో మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.

తొగర పాయలో ఉధృతి

అయినవిల్లి: ముక్తేశ్వరం తొగరపాయలోకి మరోసారి వరద పోటెత్తింది. తొగరపాయలో వరద ప్రవహించడంతో పాత వంతెనను వరద తాకింది. ముక్తేశ్వరం–కోటిపల్లిరేవులో నీటిమట్టం పెరిగింది.



బూరుగులంక రేవులో పడవపై వెళ్తున్న లంక గ్రామాల ప్రజలు

లంక గ్రామాల్లో ఉన్న పశువులను సురక్షిత ప్రాంతాలకు రైతులు తరలిస్తున్నారు. మండలంలోని వీరవల్లిపాలెం, శానపల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురులంక, చింతనలంక, మడుపల్లిలంకలోని పల్లపు పొలాల్లోకి వరద చేరింది.